www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 14 జూన్ 2025
5
చిత్తూరు

## ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజాదర్బార్

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నగరపాలక ఎంఈ వెంకటరామిరెడ్డి పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 14 వినతులు, ఫిర్యాదులు అందాయి. వీటిని సంబంధిత శాఖల అధికారులకు అందించారు. కార్యక్రమంలో ట్రాన్స్-కో ఏడీ ప్రసాద్, డిప్యూటీ తహశీల్దారు ఇబ్రహీం, హౌసింగ్ ఏఈ శ్రీధర్ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వినతి పత్రాలు స్వీకరిస్తున్న ఎంఈ వెంకటరామి రెడ్డి

# నెత్తురోడిన రహదారులు

సొంత గ్రామానికి చేరిన మృతదేహాలు

ఆసుపత్రిలో తులసి, హిత్వీక్ రెడ్డి, ప్రణీతల మృతదేహాలు

మృతదేహాలు కేశవరెడ్డి, తులసి, హిత్వీక్ రెడ్డి, శారద (ఫైల్‌ఫొటోలు)

చిత్తూరు- బెంగళూరు రహదారిలో

## ఘోర రోడ్డు ప్రమాదం..

- వేర్వేరు ప్రమాదాల్లో 8 మంది మృతి
- ఆయా గ్రామాల్లో విషాదఛాయలు

**ప్రజాశక్తి- వెదురుకుప్పం:** కర్నాటక రాష్ట్రం హోస్పేట్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో చిత్తూరు జిల్లా జీడీనెల్లూరు నియోజకవర్గానికి చెందిన నలుగురు, తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం తిమ్మరాజుపల్లి గ్రామంలో ఒంటెల హరిబాబు చిన్నకుమార్తె ప్రణతి (5) మృతిచెందారు. చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం ఆళ్లమడుగుకు చెందిన రైతు కూలీ కె.కేశవరెడ్డి అలియాస్ పెద్దబ్బరెడ్డి (45), సోదరుని కొడుకు హిత్వీక్‌రెడ్డి (40 రోజులు), శ్రీరంగరాజపురం మండలం పుల్లూరు పంచాయతీ కమ్మకండ్రిగ గ్రామానికి చెందిన తులసి అలియాస్ తనూజ (21) సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జీడీనెల్లూరు మండలం పాపిరెడ్డిపల్లి పంచాయతీ శారద (45) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు.

చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నియోజకవర్గ పరిధిలో వెదురుకుప్పం, శ్రీరంగరాజపురం, గంగాధర నెల్లూరు, పెనుమూరు మండలాల నుంచి పలు కుటుంబాలు జీవనాధార నిమిత్తమై కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు రాకపోకలు సాగిస్తున్నారు. నియోజకవర్గ పరిధిలోని వెదురుకుప్పం మండలం ఆళ్లమడుగు చెందిన రైతు కూలీ కె. కేశవరెడ్డి అలియాస్ పెద్దబ్బరెడ్డి (45) తమ కుటుంబంతో కలిసి బెంగళూరులో ప్లంబరింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వారం రోజుల క్రితం గ్రామంలో వ్యవసాయ పనుల నిమిత్తం సోదరుడు జనార్ధన్ రెడ్డి కుటుంబంతో కలిసి గ్రామానికి చేరుకుని పనులు ముగించుకుని భార్య శ్యామల, ముగ్గురు పిల్లలను ఇంటి వద్ద వదిలి తల్లి పాపమ్మ, సోదరుడు జనార్ధన్‌రెడ్డి వారి పిల్లలు హిత్వీక్ రెడ్డి (40రోజులు) మరదలు గిరిజ, తమ్ముడు కొడుకు జస్వంత్ రెడ్డితో కలిసి బెంగళూరుకి గురువారం రాత్రి పయనమయ్యారు. ఈక్రమంలో చిత్తూరు డిపో 2కు చెందిన ఆర్టీసీ బస్సులో రాత్రి 9.30గంటల సమయంలో ప్రయాణికులతో డ్రైవర్ కరుణాకర్ రెడ్డి బయలుదేరారు. చిత్తూరు నుంచి తాము నివాసముంటున్న బెంగళూరు నగరంలోని పుట్టనహళ్లి ప్రాంతానికి వెళ్లే బస్సు కావడంతో కె.కేశవరెడ్డి కుటుంబం నిద్రకు ఉపక్రమించింది. రాత్రి రెండు గంటల సమయంలో కర్ణాటక రాష్ట్రం హోస్కోట సమీపంలో బస్సు ముందు వెళ్తున్న లారీని అధికమించి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొనడంతో కేశవరెడ్డి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కేశవరెడ్డి ఒడిలో సేదతీరుతున్న తమ్ముడి కుమారుడు 40 రోజుల పసికందు హిత్విక్ రెడ్డి సైతం కన్నుమూశాడు. స్వల్ప గాయాలతో కేశవరెడ్డి సోదరుడు జనార్ధన్ రెడ్డి, మరదలు గిరిజ, తమ్ముడి పెద్ద కుమారుడు జశ్విన్ రెడ్డి, తల్లి పాపమ్మ ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఇదే బస్సులో ప్రయాణిస్తున్న శ్రీరంగరాజపురం మండలం పుల్లూరు పంచాయతీ కమ్మకంటిక గ్రామానికి చెందిన తులసి(21) సైతం సంఘటనా స్థలంలోనే మృతి చెందింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గంగాధర్ నెల్లూరు మండలం పాపిరెడ్డిపల్లి పంచాయతీకి చెందిన శారద (45) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈప్రమాదంలోనే వెదురుకుప్పం మండలం నచ్చుకూరు గ్రామానికి చెందిన వివాహిత ధనలక్ష్మి తీవ్రంగా గాయపడ్డారు. ధనలక్ష్మి, భర్త మదన్ రెడ్డి, కుమారుడు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పెనుమూరు మండలానికి చెందిన చాతుర్య తిరుపతి చదలవాడ ఇంజనీరింగ్ కాలేజీ చదువుతున్నాడు, ఇతనికి ప్రమాదంలో ఎడమ కాలు తీవ్రగాయాలైనట్లు తెలియజేశారు. కర్ణాటక పోలీసులు మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు

### ఆరుగురు మరణించడం బాధాకరం : మంత్రి రాం ప్రసాద్ రెడ్డి

కర్ణాటక హోస్కోట వద్ద ఘోర రోడ్డు ప్రమాదంలో చిత్తూరుకు చెందిన వారు మృతి చెందడం బాధాకరమని చిత్తూరు జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. పరిస్థితిపై అధికారులు నుండి సమాచారం తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి సహాయం అందేలా చూస్తామని, బాధితులకు తక్షణ వైద్యం సహాయం కల్పించాలని అధికారులను ఆదేశించారు.

### తీవ్రంగా కలచివేసింది : ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు- బెంగళూరు జాతీయ రహదారిలో జరిగిన ఘోర రోడ్డుప్రమాదం తీవ్రంగా కలచివేసిందని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ రోడ్డు ప్రమాదంలో మరణించిన మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

### క్షతగ్రాతులకు మెరుగైన వైద్యం అందించాలి
### మాజీ డిప్యూటీ సిఎంనారాయణస్వామి

కర్ణాటక రాష్ట్రం హోస్కోట వద్ద ప్రమాదానికి గురై ఆరుగురు మృతిచెందిన వార్త దిగ్భ్రాంతి కలిగించిందని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, వైసిపి నియోజకవర్గ ఇన్చార్జి కృపాలక్ష్మి అన్నారు. ఈ ఘటనలో వెదురుకుప్పం మండలం, ఎస్ఆర్ పురం మండలం జీడీనెల్లూరు మండలంకు చెందిన వారు మరణించడం బాధాకరమని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### ఘటనపై ఆరా తీసిన ఎమ్మెల్యే గురజాల

కర్ణాటక రోడ్డు ప్రమాదంపై చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదం జరిగిన తీరు, ప్రయాణికుల పరిస్థితి, వైద్యసేవలు అందుతున్న తీరుపై డిపో మేనేజర్‌తో మాట్లాడారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలన్నారు.

### కర్నాటక రోడ్డు ప్రమాదంలో...
### చిన్నారి ప్రణతి మృతి

**రామచంద్రాపురం (తిరుపతి జిల్లా):** తిరుపతి జిల్లా రామచంద్రపురం మండలం, తిమ్మరాజు పల్లిలో గంగమ్మకు కుంభాలు ఉత్సవాలకు వచ్చి తిరిగి బెంగళూరుకు వెళుతుండగా హోస్‌పేట వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో తిమ్మరాజు పల్లి గ్రామానికి చెందిన ఒంటెల హరిబాబు చిన్న కుమార్తె ప్రణతి(5) మృతి చెందింది. హరిబాబు పెద్ద కుమార్తె కాత్యాయిణి ఎడమ కాలు విరిగిపోయింది, రెండవ కుమార్తె మాధురికి కుడి చెయ్యికి తీవ్ర గాయమైంది. ఒంటెల హరిబాబు బెంగళూరులో ఆర్మీలో ట్రైనింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు.

రోడ్డు పక్కన్న నిల్చున్న వారిపైకి దూసుకెళ్లిన కారు

## ముగ్గురు మృతి

**ప్రజాశక్తి- బంగారుపాళ్యం:** బంగారుపాళ్యం మండలం చెన్నై- బెంగళూరు జాతీయ రహదారి తిమ్మోజపల్లి వద్ద శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది. సిఐ శ్రీనివాసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తిమ్మోజిపల్లి గ్రామానికి చెందిన మండలం టీడీపీ రైతు విభాగం మాజీ అధ్యక్షుడు రాజేందర్ నాయుడు (54), అదే గ్రామానికి చెందిన వ్యవసాయ శాఖ విస్తరణ అధికారి సాదరయ్య (45) సర్వీసు రోడ్డులో నడిచి వెళుతుండగా అతివేగంగా దూసుకొచ్చిన ఓ కారు వారిని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజేంద్ర నాయుడు, కారు నడుపుతున్న సయ్యద్ దిలీప్(54) అక్కడిక్కడే మరణించారు. తీవ్రంగా గాయపడిన సాదరయ్యను బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన చికిత్స కోసం వేలూరు సీఎంసీకి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. అలాగే కారులో ప్రయాణిస్తున్న సయ్యద్ దిలీప్ భార్య మొబిన, కుటుంబ సభ్యులు ఆసం ఫాతిమా, సయ్యద్ అలీ, బేబీ ఫాతిమా తీవ్రంగా గాయపడ్డారు. వీరికి ప్రథమ చికిత్స చేపట్టి మెరుగైన చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

మృతులు రాజేంద్ర నాయుడు, సాదరయ్య (ఫైల్ ఫొటో)

రోడ్డు ప్రమాదంలో మరణించిన రాజేంద్ర నాయుడు, సాదరయ్య కారులోనే మరణించిన సయ్యద్ దిలీప్

## నేడు జిల్లాకు మంత్రి అచ్చెన్నాయుడు రాక

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక శాఖ మంత్రి అచ్చెన్నాయుడు జిల్లా పర్యటనలో భాగంగా 14న శనివారం జిల్లాకు రానున్నారని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంత్రి పర్యటనలో భాగంగా 14వ తేదీ శనివారం మధ్యాహ్నం 12.45గంటలకు చిత్తూరు చేరుకుంటారని, అనంతరం 2 గంటలకు గుడిపాల మండలం పల్లూరులోని ఫూడ్స్ అండ్ ఇన్స్ మామిడి పండ్ల గుజ్జు పరిశ్రమకు చేరుకుంటారన్నారు. తదుపరి 3 గంటలకు మంగసముద్రం మార్కెట్ యార్డ్ చేరుకుని మామిడి రైతులు, పండ్ల గుజ్జు పరిశ్రమ ప్రతినిధులతో ముఖాముఖీ నిర్వహించాన్నారని తెలిపారు. అనంతరం 3.30 గంటలకు తిరుమలకు బయల్దేరి వెళతారని పేర్కొన్నారు.

అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

## 16న కలెక్టరేట్ వద్ద ధర్నా

ఐరాల ప్రాజెక్టు సమావేశంలో మాట్లాడుతున్న వాడ గంగరాజు

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలకు తల్లికి వందనం, ఇతర సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వాడ గంగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం ఐరాల ప్రాజెక్టు మూడు మండలాల అంగన్వాడీల సమావేశం జమున అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్కీం వర్కర్లకు సంక్షేమ పథకాల అమలు చేస్తామని ఇచ్చినప్పటికీ హామీ ప్రకారం అంగన్వాడీలకు ప్రభుత్వం జీవో ప్రకటించిన తల్లికి వందనం అందలేదన్నారు. అదేవిధంగా పింఛన్లు, రేషన్‌కార్డులు ఇతర సంక్షేమ పథకాలేవి కూడా అంగన్వాడీలకు వారి కుటుంబ సభ్యులకు అందకపోవడం బాధాకరమన్నారు. ఈ సమస్యలపై ప్రభుత్వమే అమలు చేయాలని 16న రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా చిత్తూరు కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో జిల్లాలోని అంగన్వాడీలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వీటితోపాటు రాష్ట్ర ప్రభుత్వం 42 రోజులు సమ్మె సందర్భంగా అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని వర్కర్లకు మెయిన్ వర్కర్లుగా గుర్తిస్తూ వెంటనే జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు గ్రాట్యూటి అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు వనజ, హేమలత, నీరజ, బేబీ పాల్గొన్నారు.

## 5న జాతీయ లోక్ అదాలత్

**ప్రజాశక్తి చిత్తూరు అర్బన్:** జులై 5న (శనివారం) దేశవ్యాప్తంగా జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ ఎంఎస్.భారతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర న్యాయసేవ అధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ, సుప్రీంకోర్టు వారి ఆదేశాల మేరకు జులై 5న జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టులలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవడం వల్ల సమయం, ధనం ఆదా అవుతుందని తెలిపారు. లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పు అని దానిపై ఆపిల్ ఉండదని తెలిపారు. లోక్ అదాలత్‌లో అన్ని రకాల రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, సివిల్ తగాదాలు, మోటార్ వాహనాల కేసులు, చెక్ బౌన్స్ కేసులు, బ్యాంక్ కేసులు, మొదలగు కేసులను రాజీ చేసుకోవచ్చునని తెలిపారు. కక్షదారులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకొవాలని అన్నారు. అలాగే లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు, న్యాయ వాదులు, రెవెన్యూ, పోలీసు, బ్యాంకు అధికారులు, చిట్ ఫండ్ కంపెనీలు, బీమా సంస్థ ప్రతినిధులు, కక్షదారులు పాల్గొని జిల్లాలో ఎక్కువ కేసులు పరిష్కరించి చిత్తూరు జిల్లాను రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో ఉండేలా సహకరించాలని జడ్జి ఆ ప్రకటనలో తెలిపారు.

## దోమల వృద్ధిని అరికట్టేందుకే ఫ్రైడే.. డ్రైడే..

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** చిత్తూరు జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ శుక్రవారం అర్బన్ హెల్త్ సెంటర్ మాపాక్షి పరిధిలోని ఎల్‌బి.పురం సచివాలయం, సిజి.పల్లె గ్రామంలో ఫ్రైడే డ్రైడే నిర్వహిస్తున్న తీరును తనిఖీ చేయడం జరిగింది. దోమలు వల్ల మలేరియా, డెంగీ, చికున్ గున్యా, బోదకాలు, మెదడువాపు వ్యాధి మొదలగు జ్వరాలు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని, మలేరియా నివారణ మాసోత్సవాలు సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అనంతరం అంగన్వాడీ సెంటర్ సందర్శించి పిల్లలకు దోమలు కుట్టకుండా కిటికీలు, తలుపులకు మెష్ డోర్స్ ఉండాలని సూచించారు. అలాగే పిల్లలకు నాణ్యమైన ఆహారం పెట్టాలని పరిశుభ్రత పాటించాలని తెలిపారు. సబ్ యూనిట్ ఆఫీసర్ రామకష్ణ, సూపర్వైజర్ నారాయణ, ఏఎన్ఎం రాణి, ఆశా కార్యకర్త అరుణ పాల్గొన్నారు.

జాగ్రత్తలను తెలియజేస్తున్న జిల్లా మలేరియా అధికారి

## రాజకీయాలకతీతంగా అభివృద్ధి : జెడ్పీ చైర్మన్

**ప్రజాశక్తి- వి కోట:** రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో అధికారులు ప్రజలకు సహకరించాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ యువరాజ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పి చైర్మన్ మాట్లాడుతూ మండలంలో గత వేసవిలో తాగునీటి సమస్యలు పరిష్కారానికి గాను కోటి19 లక్షల రూపాయలు జిల్లా పరిషత్ నిధులు వెచ్చించామన్నారు. రాబోవు ఆర్థిక సంవత్సరంలో మండల పరిధిలో మురుగునీటి కాలువలు సిమెంట్ రోడ్ల నిర్మాణానికి సుమారు రూ. రెండు కోట్లు నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులు స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో అవసరమైన ప్రాంతాలను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు గత మూడు నెలల కాలంలో ప్రభుత్వపరంగా అమలు జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాల ప్రగతిని సమావేశంలో సభ్యులకు వివరించారు. గత ప్రభుత్వంలో గ్రామాల్లో వేసిన రోడ్లు, శిలాఫలకాలను కొంతమంది ధ్వంసం చేయడాన్ని నివారించడంలో విఫలమైన పంచాయతీరాజ్ అధికారుల తీరును ఎంపీపీ యువరాజ్ తప్పు పట్టారు. ప్రభుత్వాలు మారినా ప్రజాధనంతో చేపట్టిన అభివృద్ధి పనులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వారు సూచించారు. ఓగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది కొరతను పరిష్కరించాలని వైద్యాధికారి తీసుకొచ్చారు. గత ఐదారు నెలలుగా రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యా వ్యవస్థలో మార్పులు వచ్చాయని ఎంఈఓ చంద్రశేఖర్ సభ్యులకు వివరించారు. మండలానికి 40 మోడల్ ప్రైమరీ పాఠశాలలు మంజూరయ్యాయన్నారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయనున్నట్లు వారు తెలిపారు. మండల పరిధిలో పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా మారకమలయ్యకుంట మినహా మిగిలిన అన్ని ప్రాథమికోన్నత పాఠశాలలను సమీపంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విలీనం చేసామన్నారు. మండల పరిధిలో తల్లికి వందనంకు అర్హులైన విద్యార్థుల జాబితాను సంబంధిత సచివాలయాల్లో, ఎమ్మార్సీల వద్ద నోటీస్ బోర్డులో ప్రదర్శించనున్నట్లు వారు సభ్యులకు తెలిపారు. మండల పరిధిలోని కప్పట్లబండ గ్రామంలో సుమారు 20 మంది విద్యార్థులకు ఆధార్ కార్డు లేని కారణంగా ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయానికి వారు నోచుకోకపోతున్నారని వీటిని పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలని సభ దృష్టికి తీసుకువచ్చారు. అన్ని ప్రభుత్వ ప్రవేటు పాఠశాలల్లో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల చేత యోగాభ్యాసం చేయించనునట్లు ఎంపీడీవో ఈశ్వరన్ తెలిపారు. అనంతరం వ్యవసాయ, ఉద్యానశాఖలో ఉన్న సబ్సిడీలు పారదర్శకంగా అందించేందుకు స్థానిక రైతు భరోసా కేంద్రాల వద్ద రైతులకు అనుకూలంగా నోటీసు బోర్డులో ఉంచాలని అధికారులకు సూచించారు. మండల పరిధిలో భూ సర్వే జరిగిన పంచాయతీలలో ఉన్న సమస్యలను సత్వరం పరిష్కరించాలని సభ్యులు రెవెన్యూ అధికారులను నిలదీశారు. రైతులు చెరువులోని ఒండ్రు మట్టిని తరలించుకునేందుకు ఆటంకం కల్పించరాదని సభ్యులు రెవెన్యూ అధికారులను కోరారు. మండల పరిధిలో వివిధ దశల్లో పెండింగ్లో ఉన్న దాదాపు 900 ఇండ్లను నిర్ణీత కాలవ్యవధి లోపు పూర్తి చేయాలనిహౌసింగ్ ఏఈను ఆదేశించారు. ఏనుగుల దాడుల్లో పంట నష్టపోయిన 11మంది రైతులకు రూ.73,500 వేలు చెక్కులను అందించినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. వీటితోపాటు పలు శాఖలలో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులు సమావేశంలో సభ్యులకు వివరించారు జిల్లా పరిషత్ సలహా మండల సభ్యులు గౌస్, వైస్ ఎంపీపీ లక్ష్మణ్‌రెడ్డి, అధికారులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో ప్రసంగిస్తున్న జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

## రహదారుల దశ తిరిగేది ఎన్నడో..?

- అస్తవ్యస్తంగా గ్రామీణ రహదారులు

**గత ప్రభుత్వం పాలన విధంగానే నేడు కూటమి పాలన కూడా సాగుతోంది.. ప్రభుత్వాలు మారిన గ్రామీణ రహదారుల పరిస్థితి మాత్రం దారుణంగానే ఉంది. గ్రామీణ ప్రజలు రహదారులతో నరకయాతన అనుభవిస్తున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యారు. ప్రమాదాలతో ఆసుపత్రి పాలవుతున్న ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలేస్తున్నారు. గ్రామీణ రహదారులకు దశ తిరిగేది ఎన్నడో అనట్టు పల్లెవాసులు ఎదురుచూస్తున్నారు.**

**ప్రజాశక్తి- పూతలపట్టు:** పాలకులు మారిన అధికారులు మారిన గ్రామీణ రహదారుల దుస్థితి మాత్రం అగమ్య గోచరంగానే తయారయ్యింది. నిత్యం తమ గ్రామాల నుంచి రాకపోకలు సాగించే గ్రామీణ ప్రజలు రహదారుల్లో కనీసం కాలు కూడా మెదపలేని దుస్థితి నెలకొంది. ద్విచక్ర వాహనదారులైతే రహదారుల్లో ప్రయాణించలేక ఇల్లు చేరేవరకు ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకొని చేరాల్సిన పరిస్థితి. కొన్ని గ్రామాల్లో అయితే ప్రజలు రహదారులకు భయపడి చీకటికి ముందే గ్రామాన్ని చేరుకుంటున్నారు. రహదారులు ఏర్పడిన గుంతల కారణంగా ప్రయాణించలేని పరిస్థితులే ఇందుకు ఉదాహరణ. ఇక ఆటోలు అయితే రహదారులకు భయపడి కొన్ని గ్రామాలకు వెళ్లడానికి ప్రత్యేక చార్జీలు వసూలు చేస్తున్నారు. గత ప్రభుత్వము రహదారుల మరమ్మత్తులను గాలికి వదిలేసింది. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఇదే తరహాలో పాలన సాగిస్తున్నాడంతో తమ గోడును ఎవరికి చెప్పుకోవాలని గ్రామీణ వాసులు వాపోతున్నారు. నూతన రోడ్డు లేకపోయినా కనీసం గుంతలను పూడ్చి మరమ్మతులైన చేయాలని వేడుకుంటున్నారు.

### మండలంలోని పరిస్థితి..

పూతలపట్టు మండలంలో మొత్తం 25 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 252 గ్రామాలు ఉన్నాయి. ఇందులో సుమారు 170 గ్రామాల వరకు రహదారి సమస్యలు నెలకొన్నాయి. ముఖ్యంగా పూతలపట్టు నుంచి పోలవరం వెళ్ళు రహదారి అయితే మరింత అధ్వానంగా మారింది. ఇదే రహదారి పెనుమూరు మండలానికి అనుసంధానమై ఉండడంతో వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. తారు రోడ్డు కాస్త గుల్ల రోడ్డుగా మారడంతో ప్రయాణికులు అసలు పడుతున్నారు. చామంచిపురం, గొడుగు చింత, అయ్యప్ప గారి పల్లి, పోటుకనుమ, రామాపురం, మరికొన్ని గ్రామాల కు రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

పోలవరం రోడ్డు పరిస్థితి

# కొనేవారు లేరు..!

- ముందుకు రాని పరిశ్రమలు
- పరిశ్రమల్లో పేరుకుపోతున్న గుజ్జు నిల్వలు
- అదును దాటుతున్న కాలం
- చెట్లకే కాయలు పరిమితం
- రైతుల గుండెల్లో గుబులు

**ప్రజాశక్తి -గంగవరం (పలమనేరు రూరల్):** వందల ఎకరాల్లో ఎన్నో ఆశలతో పండించిన మామిడి రైతులు కొనుగోలు లేక కాయలను చెట్లకే వదిలివేశారు. ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం మామిడి కేజీకి మద్దతు ధర 12 రూపాయలు ప్రకటించినా ప్రైవేటు పరిశ్రమల వ్యాపారులు గుజ్జు నిల్వలు పేరుకుపోవడంతో ఈ ఏడాది కొనుగోలు చేసేందుకు ముందుకు రావడంలేదు. గతంలో వ్యాపారులు తోటల వద్దకు వచ్చి మామిడి కాయలు కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం ఒక్కరూ కూడా రావడంలేదు. ఒక వైపు అదును తప్పుతున్న కాలంతో మామిడి కాయలు అమ్ముకోలేక చెట్లకే పరిమితం చేశామనే బాధ, మరో వైపు వెచ్చించిన కనీస పెట్టుబడి కూడా రాకపోవడంతో రైతులు గుండెల్లో గుబులు పట్టుకుంది. నిరాశతో దిక్కులు చూడడం మామిడి రైతుల వంతు అయ్యింది.

**కొనేవారు లేరు..!**

మామిడి కాయలు కొనేవారు లేక కాలం అదును దాటి పోతుండడంతో చెట్లలోనే రైతులు వదిలివేశారు. గంగవరం మండలం ఒక కక్కీలపట్ల పంచాయతీలోనే 500ఎ కరాలు, పలమనేరు రూరల్ మండల పరిధిలో 2 వేల ఎకరాల దాకా మామిడి పెంపకం వుంది. ఈ ఏడాది సుమారు మూడువేల టన్నులు పంట దిగుబడి అయ్యినట్లు అంచనా. ముఖ్యంగా వ్యవసాయంలో గిట్టుబాటు ధరలు లేకపోవడం, మండల పరిధిలో అటవీ ప్రాంతం ఎక్కువ కావడంతో వ్యవసాయం చేస్తే వన్యమృగాల బారిన పడి నష్టపోవాల్సి వస్తుందని ఎక్కువ మంది రైతులు మామిడి చెట్ల పెంపకం అలవాటు చేసుకున్నారు. దీంతో పాటు మెట్ట ప్రాంతాలలో వ్యవసాయానికి అనుకూలంగా లేకపోవడంతో కొంతమంది రైతులు మామిడి చెట్లు పెంచారు. నీటి సౌకర్యం లేకపోవడంతో అనేక మంది ఈ మామిడి సాగు

చెట్లకే పరిమితమైన మామిడి కాయలు

పైనే ఆసక్తి చూపారు. ఎన్నడూ లేని విధంగా ఈ సంవత్సరం ఎక్కువ మామిడి దిగుబడి కావడంతో ధరలు పతనమయ్యాయి.

**పరిశ్రమల్లో పేరుకుపోతున్న గుజ్జు నిల్వలు**

దీనికి తోడు గతంలో ఎకరాకు లక్ష రూపాయలు నుండి ఒకటిన్నర లక్ష ఆదాయం ఉండేదని ప్రస్తుతం అది పూర్తిగా తలకిందులు అయిందని అంటున్నారు ఫ్యాక్టరీలలో గుజ్జు నిలచి పోవడం ఒక కారణమైతే సాగు ఎక్కువ కావడం ఇంకొక కారణం అని పలువురు అంటున్నారు. సమీపంలో బంగారుపాళ్యం, చిత్తూరు, బెంగుళూరులలో ప్రైవేటు మామిడి జ్యూస్ ఫ్యాక్టరీలు వున్నాయి. వాటిలో గత ఏడాది ఉత్పత్తి చేసిన జ్యూస్ నిల్వలు పేరుకుపోయాయి. ఈ కారణంగా ఫ్యాక్టరీల వారు రైతుల వద్ద మామిడి కొనుగోలుకు విముఖత వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు గత ఏడాది వరకు తోటల వద్దకు వ్యాపారులు వచ్చి నిర్ణీత ధరకు తీసుకెళ్లేవారని ఈ ఏడాది ఒక్కరు కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**చెట్లకే కాయలు పరిమితం**

కొనుగోలు చేసే మామిడి ప్రైవేటు పరిశ్రమలు ముందుకు రాకపోవడంతో రైతులు అయోమయంలో పడ్డారు. కాయలు కోయకపోవడంతో చెట్లకే పరిమితమయ్యాయి. అదును దాటు తున్న కాలం, చెట్లకే పరిమితమైన కాయలు ప్రస్తుతం రాలి పోయేందుకు సిద్ధం వుండడంతో తమ పరిస్థితి ఏమిటని రైతులు ఆందోళన చెందుతున్నారు.

**ప్రభుత్వ మద్దతు ధర అమలు ఏదీ?**

రాష్ట్ర ప్రభుత్వం మామిడి రైతులకు కేజీ 12 రూపాయలకు కొనుగోలు చేసేలా ప్రయివేటు ఫ్యాక్టరీల యాజమాన్యాన్ని ఒప్పించాలని కలెక్టర్లకు బాధ్యత అప్పగించింది. కలెక్టరు ఆయా మండలాల రెవెన్యూ అధికారులకు మద్దతు ధర అమలును పర్యవేక్షించాలని ఆదేశించారు. అయితే మండలంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం అమలు కావడంలేదు. దీనిపై సంబంధిత మండల తహశీల్దారు మాధవరావును వివరణ కోరగా ఈ విషయం తమకు సంబంధం లేని విషయం, ఉద్యాన అధికారులు పర్యవేక్షి స్తారని చెప్పడం గమనార్హం. అటు ఉద్యాన శాఖాధి కారులను ఫోను ద్వారా కనుక్కునేందుకు ప్రయత్నించగా స్పందించలేదు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి మండల మామిడి రైతుల సమస్యను పరిష్కరించాల్సిన అవసరం వుంది.

**ఐదు ఎకరాల్లో మామిడి వదిలేశాను..**

నాకు ఐదు ఎకరాలు మామిడి తోట వుంది. గతంలో ఎకరా లక్ష రూపాయ లకు అమ్మే వాడిని... ప్రస్తుతం వ్యాపారులు రాకపోవడంతో కాయలు అలానే ఉండిపోయి రాలడానికి సిద్ధంగా ఉన్నాయి..గతం కంటే ఈ ఏడాది పంట బాగా వచ్చింది. అధిక మొత్తంలో డబ్బులు వస్తాయని ఆశపడ్డాం.. వ్యాపారులు కొన డానికి ఎవరూ ముందుకు రాలేదు..ఇప్పటి వరకు క్రిమి సంహారక మందులు, దున్నేందుకు లక్ష రూపాయలు వెచ్చించాను..కనీసం ఆ ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదు..

**- శ్రీనివాసులు, మామిడి రైతు.**

**కనీస పెట్టుబడి కూడా వచ్చే స్థితి లేదు..**

నాకు రెండు ఎకరాల మామిడి తోపు తప్ప వేరే ఏ భూమి లేదు.. వ్యవసాయం కష్టతరమని ఉన్న రెండు ఎకరాల్లో మామిడి చెట్లు పెంచాం.. ఈ సంవత్సరం పంట బాగా రావడంతో ఆదాయం బాగా వస్తుందని చాలా ఆశపడ్డాం.. దోమల నివారణకు ప్రభుత్వం సరఫరా చేసిన తిత్తులు కూడా ఏర్పాటు చేశాం.. పూత సమయంలో వర్షం లేక పోవడంతో ట్యాంకులతో రెండు నెలల పాటు చెట్లకు నీరు సరఫరా చేశాం.. బాగా పండిన పంటను చూసి ఎంతో ఆశతో ఉన్న సమయంలో వ్యాపారులు ఎవరూ రాక పోవడంతో కాయలు చెట్టుకే పరిమితం అయ్యాయి. మాకు ఇదే ఆధారం.. బతుకుతెరువు కోసం మరో మార్గం లేదు.. ఇక కూలి పనులే ఆధారం.. మండి వ్యాపారులు కిలో పది రూపాయలు నుండి 15 రూపాయలకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. అయితే పలమనేరు టౌన్‌లో మాత్రం బజార్లలో అమ్మే వారు కిలో రూ.50 నుండి 80 రూపాయల వరకు అమ్ముతున్నారు. ఏమి చేయాలో దిక్కుతోచడం లేదు.

**- సరోజమ్మ, మామిడి రైతు.**

# క్రైం న్యూస్

వాహనదారులను తనిఖీ చేస్తున్న పోలీసులు

## ఇద్దరిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు

**ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి:** మండలంలో ఇద్దరు వ్యక్తులపై డ్రంక్అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశామని ఎస్ఐ పరశురాముడు తెలిపారు. మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలిలో ఉన్నతాధికారి ఆదేశాల మేరకు ఎస్ఐ బి పరశురాముడు శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా మద్యం తాగి ద్విచక్ర వాహనంలో వెళుతున్న ఇద్దరు వ్యక్తులను గుర్తించారు. గంగవరం మండలం నల్లదుమ్మన పల్లి గ్రామానికి చెందిన కృష్ణ, బైరెడ్డిపల్లి మండలం మండలం బెల్లంమడుగు గ్రామానికి చెందిన వెంకట రమణలపై డ్రంక్అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశామని తెలిపారు. మద్యం తాగి డ్రైవింగ్ చేసే ప్రతి వ్యక్తి రోడ్డు నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా వారి గమ్యానికి చేరు కోవాలని దీన్ని ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మాట్లాడుతున్న మామిడి రైతు సంక్షేమ సంఘం కమిటీ కన్వీనర్లు

## టోకన్ల మంజూరులో పారదర్శకత ప్రకటించాలి

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** జిల్లాలో తోతాపురి మామిడి రైతులు ఎదుర్కొనే సమస్యలు సత్వరం పరిష్కరించాలని మామిడి రైతు సంక్షేమ సంఘం కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసింది. శుక్రవారం చిత్తూరులో కమిటీ కన్వీనర్లు డాక్టర్ టి.జనార్థన్, హరిబాబు చౌదరి మాట్లాడుతూ కలెక్టర్ ఫ్యాక్టరీల వద్ద ధరల పట్టిక ప్రదర్శించాలని ఉత్తర్వులు ఇచ్చి ఐదు రోజులు కావస్తున్నా నేటికీ పలువురు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహించారు. ధరలు పట్టిక పెట్టని గుజ్జు యజమానులపై తగుచర్యలు తీసికోవాలని డిమాండ్ చేశారు. పలు ప్రాసెసింగ్ యూనిట్లు టోకన్ల జారీలో ఇష్టారాజ్యంగా వ్యవహరస్తున్నారని, దీనిలో రాజకీయ జోక్యం నివారించాలని కోరారు. ఎఫ్-3 యజమాని రమేష్ రైతు నాయకులపై దురుసు ప్రవర్తనను తీవ్రంగా ఖండిస్తున్నామని, అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు సంఘం కార్యదర్శి కె.మునిరత్నం నారయుడు, భారతీ, చంద్రశేఖర్, చంద్రమౌళి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి భారతి

## వయోవృద్ధులను చూడకుంటే భరణం చెల్లించాలి

జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి భారతి

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** వయోవృద్ధులైన తల్లిదండ్రుల బాగోగులను చూడని కొడుకు, కూతురు నుండి సెక్షన్ 125 కింద భరణం వసూలు చేస్తారని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎంఎస్ భారతి పేర్కొన్నారు. సుప్రీంకోర్టు, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక తపోవనం వద్ద ఉన్న వయోవృద్ధుల ఆశ్రమాన్ని పరిశీలించి, వయోవృద్ధులకు రాజ్యాం గం కల్పించిన హక్కులు, చట్టాలపై నిర్వహించిన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు సంపాదించిన ఆస్తిని దానపత్రంతో కొడుకులకు కూతుళ్లకు రాయించడం జరిగిన తర్వాత కొడుకులు, కూతుళ్లు వయోవృద్ధులైన తల్లిదండ్రుల బాగోగులను సరిగా పట్టించుకోని తల్లిదండ్రులు 144 కింద కోర్టును ఆశ్రయిస్తే వారు రాయించిన దాన పత్రాన్ని రద్దు చేస్తారని తెలిపారు. ఇలాంటి వాటికి సంబంధించి వయోవృద్ధులు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థలో కేసు వేసిన వాటికి సంబంధించి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఉచితంగా న్యాయ సేవలు అందిస్తారని తెలిపారు. అంతకుముందు జడ్జి వయోవృద్ధులు ఉన్న ఆశ్రమం పరిశీలించి వారికి అందుతున్న వైద్య సేవలను పరిశీలించి, అందరికీ పెన్షన్లు వస్తున్నాయా? ఆరోగ్య పరంగాని ఏమైనా సమస్యలు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి ఉద్యోగుల సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షులు కేశవులు, మురళి, డిజేబుల్ వెల్ఫర్ వసతి గృహం స్టాఫ్ నర్స్ అరుణ, తదితరులు పాల్గొన్నారు.

## ఐసిడిఎస్‌కు నలుగురు సిబ్బంది రాక

జయశ్రీ

పి రెడ్డికళ్యాణి

**ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు:** గంగాధర నెల్లూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయానికి వేర్వేరు మండలాల్లో పనిచేస్తున్న వివిధ కేడర్‌లకు చెందిన అధికారులు, సిబ్బంది బదిలీపై నలుగురు కొత్తగా వచ్చారు. బంగారుపాలెం మండలంలో పనిచేస్తున్న సూపర్ వైజర్లు పి రెడ్డికళ్యాణి, పి జయశ్రీ, చిత్తూరు పీడీ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ భారతి, బంగారుపాళ్యంలో పనిచేస్తున్న సబార్డినేట్ శంకర్ బదిలీ చేయడంతో గంగాధర నెల్లూరుకు కొత్తగా వచ్చి విధుల్లో చేరారు.

## రైతులందరికీ వేరుశనగ విత్తనాలు అందాలి: జెడి

**ప్రజాశక్తి- పూతలపట్టు:** సచివాలయాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, రైతులందరికీ వేరుశనగ విత్తనాలు అందించాలని వ్యవసాయ శాఖ జెడి మురళీకృష్ణ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని పి కొత్తకోట గ్రామ సచివాలయంలో వేరుశనగ విత్తనాల పంపిణీని ఆయన పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. సబ్సిడీ వేరుశనగ విత్తనాలను వ్యవసాయానికి వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు పాల్గొన్నారు.

విద్యాకిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

## విద్యా కిట్లు పంపిణీ

**ప్రజాశక్తి- రామకుప్పం:** మండలంలోని ముద్దనపల్లి, అనిగానూరు, రామకుప్పం తదితర గ్రామాల్లో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా కిట్లను కూటమి నేతలు విద్యార్థులకు శుక్రవారం పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు , విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సహకారంతో పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు తదితర వస్తువు లను విద్యార్థిని విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీతో తల్లికి వందనం నగదును తల్లి ఖాతాల్లోకి రాష్ట్ర ప్రభుత్వం జమ చేసిందన్నారు. ప్రతి విద్యార్థికి 15 వేల రూపాయలు చొప్పున అందించిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు, సీతాపతి, రామ్మూర్తి, జయశంకర్, సలాం సాబ్, కడ అడ్వైజర్ రఘు, విజయ్ కుమార్ రెడ్డి, టీవీ రవి, బిజెపి నాయకులు రాజసింహ, ఆంజనేయప్ప, ఆనంద్, జనసేన నాయకులు హరీష్, నేతలు సుబ్రి, కృష్ణారెడ్డి, వెంకటాచలం, కేశవరెడ్డి, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కుప్పం ఇంజనీరింగ్ కళాశాల

## బిసిఎన్ విద్యార్థులను ఉద్యోగులుగా చేయడమే లక్ష్యం

విద్యాసంస్థల వ్యవస్థాపక అధ్యక్షులు బిసి నాగరాజు

**ప్రజాశక్తి కుప్పం రూరల్ :** బిసిఎన్ విద్యాసంస్థలలో భాగమైన కుప్పం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులను వంద శాతం ఉద్యోగులుగా చేయడమే తమ లక్ష్యమని విద్యాసంస్థల వ్యవస్థాపక అధ్యక్షులు బిసి నాగరాజు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరుతో మాట్లాడుతూ తమ కళాశాల ఆవరణలో శనివారం గొప్ప జాబ్ మేళా నిర్వహించనున్నామన్నారు. ఈ జాబ్ మేళాలో 2022 తర్వాత పట్టభద్రులైన నిరుద్యోగులు పాల్గొనవచ్చని, పదవ తరగతి, ఐటిఐ, ఇంటర్, పాలిటెక్నిక్, బీటెక్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులని, ఈ జాబ్ మేళాలో పలు రంగాలకు చెందిన 30 కి పైగా సంస్థలు పాల్గొన్నారని తెలిపారు. ఈ సంస్థలలో 1500కు పైగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, ఈ అవకాశాన్ని కేవలం కుప్పం నియోజకవర్గ నిరుద్యోగులే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నిరుద్యోగులు ఉపయోగించుకోవచ్చని అని తెలిపారు.

## వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులకు యోగా

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి సుధారాణి ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ప్రతి రోజు సాయంకాలం నాలుగు నుంచి ఐదు గంటల వరకు యోగ సాధన ఆఫీస్ ఉద్యోగస్తులతో ప్రాక్టీస్ చేసి తద్వారా ప్రతి ఒక్కరూ శారీరక , మానసిక ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. మన ఆరోగ్యం మన చేతుల్లో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు, ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

రేషన్ షాపును తనిఖీ చేస్తున్న అధికారులు

## రేషన్ షాపుపై కేసు నమోదు

**ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి:** మండలంలోని నెల్లిపట్ల పంచాయతీలోని 30వ నెంబరు రేషన్ షాపులో స్టాకు వివరాల్లో వ్యత్యాసం వుండడంతో తనిఖీ అధికారులు కేసు నమోదు చేశారు. మండలంలోని నెల్లిపట్ల పంచాయతీలోని 30వ నెంబరు రేషన్ షాపును డీఎస్ఓ కార్యాలయం ఇన్‌స్పెక్టర్ శ్యాంప్రసాద్‌రెడ్డి, సిబ్బంది శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రేషన్ షాపు డీలరు అమర్ నారాయణస్వామి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ సరుకుల స్టాకులో వ్యత్యాసం చూపాడని గుర్తించిన డీఎస్ఓ కార్యాలయం ఇన్‌స్పెక్టర్ శ్యాం ప్రసాద్ రెడ్డి ఆ షాపుపై 6ఏ కేసు నమోదు చేసి స్థానిక గ్రామ రెవెన్యూ అధికారి జయరాం సమక్షంలో షాపును స్వాధీనం చేసుకున్నారు. ప్రజలకు అందాల్సిన నిత్యావసర సరుకులు దుకాణంలో లెక్కలు తేడా రావడంతో దుకాణాన్ని సీజ్ చేసినట్లు డీఎస్‌వో ఇన్‌స్పెక్టర్ శ్యాం ప్రసాద్ రెడ్డి తెలిపారని తహశీల్దారు ప్రసన్నకుమార్ తెలిపారు.

## నలుగురికి కౌన్సెలింగ్

**ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి:** మండలంలో పదేపదే నేరాలు చేస్తూ గతంలో పట్టుబడ్డ నలుగురు వ్యక్తులలో ఇద్దరు వ్యక్తులు కర్ణాటక మద్యం విక్రయిస్తూ పట్టుబడ్డారని, మరో వ్యక్తి ఇంటి దొంగతనాలు, ఇంకొక వ్యక్తి గంజాయి కేసులో పట్టుబడి విడుదలైన వ్యక్తులను ఎస్ఐ పరశురాముడు శుక్రవారం బైరెడ్డిపల్లి పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. మళ్లీ ఇదే పద్ధతి కొనసాగిస్తే నలుగురు వ్యక్తులకు ప్రభుత్వం నుండి అందే నిత్యావసర సరుకులు, ఇతర రాయితీలను మండల మెజిస్ట్రేట్, తహశీల్దారుకి తెలిపి రద్దు చేస్తామని వారిని హెచ్చరించారు.

## సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అంత్యక్రియలు

**ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి:** ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి శ్రీనివాసులు రెడ్డి (27) గంగవరం మండలంలోని అటుకురాళ్లపల్లి చెరువులో మిత్రులతో పాటు ఈతకు వెళ్లి ప్రమాద వశాత్తు రెండు రోజుల క్రితం మునిగి మృతి చెందిన విషయం విదితమే. మృతుడు బైరెడ్డిపల్లి మండలం ఇల్లూరు గ్రామంలోని సుబ్రహ్మణ్యం రెడ్డి కుమారుడు శ్రీనివాసులురెడ్డి కర్ణాటక బెంగళూరులో సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. సెలవులో స్వగృహానికి వచ్చి అమ్మమ్మ ఇంటికి అటుకురాళ్ల పల్లికి వెళ్లాడు. ఉత్సహంగా సరదాగా ఆగ్రామం లోని చెరువులో ఈత కొట్టడానికి మిత్రులతో కలిసి వెళ్లి ప్రమాదానికి గురయ్యాడు. శ్రీనివాసులురెడ్డి మృతదేహాన్ని సొంత ఊరు బైరెడ్డిపల్లి ఇల్లూరు గ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. దీంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుము కున్నాయి. మృతుడుకి భార్య, 15 రోజుల చిన్నారి (కుమార్తె) వున్నారు.

## 19న వాహనాల బహిరంగ వేలం

**ప్రజాశక్తి -తవణంపల్లి:** తవణంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ రకాల ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 19వ తేదీ బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎస్ఐ ఏ చిరంజీవి తెలిపారు. ఒక ఈచల్ లారీ, ఒక కారు, ఏడు మోటార్ సైకిళ్లు, వాహనాలను చిత్తూరు జిల్లా అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంటు ఎస్ కృష్ణ కిషోర్ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీ తవణంపల్లి పోలీస్ స్టేషన్‌లో వేలం వేయనున్నట్లు ఎస్ఐ శుక్రవారం తెలిపారు. ఈ వేలంలో పాల్గొనేవారు తవణంపల్లి పోలీస్ స్టేషన్లో అదేరోజు ఉదయం 10 గంటలకు సంబంధించిన రుసుం చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. ఇతర వివరాలకు తవణంపల్లి పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని తెలిపారు.

## పశువులు తరలింపు పట్టివేత

**ప్రజాశక్తి -వెదురుకుప్పం:** పశువులను గో వధశాలకు తరలిస్తుండగా కార్వేటినగరం సిఐ హనుమంతప్ప తన సిబ్బందితో కలిసి శుక్రవారం పట్టుకుని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ నెల్లూరు జిల్లా నుంచి ఓ లారీ వెదురుకుప్పం వైపు వెళుతుండగా అనుమానం వచ్చి ఆపి చూశారు. అందులో 19 పశువులు ఉన్నాయి. బర్రెలు 12, దూడలు 4, ఆవులు 2, దూడ 1 వున్నాయన్నారు. డ్రైవర్‌ని అదుపులోకి తీసుకుని విచారించగా నెల్లూరు నుంచి పక్క రాష్ట్రమైన కేరళకు వధశాలకు తరలిస్తున్నట్లు చెప్పినట్లు ఆయన మీడియాకు తెలిపారు. వీటికి వైద్య పరీక్షలు నిర్వహించి, తిరుపతి గోశాలకు తరలిస్తున్నట్లు ఆయన తెలిపారు. పట్టుకున్న తమ సిబ్బందిని అభినందించారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## సమస్యలు మా దృష్టికి తీసుకురండి..

పరిష్కరిస్తామని మండల సమావేశంలో ఎంపిపి హామీ

**ప్రజాశక్తి-తవణంపల్లి:** మండలంలోని పంచాయతీల్లో ఏవైనా సమస్యలు వుంటే తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామని ఎంపిపి పట్నం ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. తవణంపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు పట్నం ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని గ్రామాల అభివృద్ధికి ఏవైనా సమస్యలు వుంటే తమ దృష్టికి తీసుకురావాలని సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. తవణంపల్లి మండల తహశీల్దారు సుధాకర్ మాట్లాడుతూ మామిడి రైతులకు మార్కెట్ రేటు ధర ప్రకారం ప్రభుత్వం ద్వారా ఫ్యాక్టరీ అధినేతలతో చర్చించి సక్రమమైన ధరలు నిర్ణయించామని తెలిపారు. మండలంలోని శ్మశానానికి దారి సౌకర్యం, ఏగొల్లపల్లి శ్మశానానికి ప్రజలతో కలిసి చర్చించి పరిష్కరించామని తెలిపారు. తవణంపల్లి వయా ముచ్చుకోలువ అటవీ మామార్గంలో రోడ్డు వేస్తామని, శ్మశానాలకు దారి కల్పన,

మండల సమావేశం నిర్వహిస్తున్న ఎంపిపి పట్నం ప్రతాప్‌రెడ్డి

ఎక్కువగా కుటుంబ సభ్యులతో భూ సమస్యలు ఉన్నాయని అధికారులు, ప్రజలతో కలిసి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. రెవెన్యూ సమస్యలు వుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఏ పీఓ బాల మాట్లాడుతూ ఎన్ ఆర్‌జిఎస్ ద్వారా పొలాలలో చెట్లు పెంపకం, పనికి ఆహార పథకం ద్వారా పలు రకాలైన అభివృద్ధి కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. అన్ని శాఖల అధికారులు తమ శాఖల వివరాలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, వైస్ ఎంపీపీలు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## యోగాపై అధికారులతో ఎంపీడీవో సమీక్ష

**ప్రజాశక్తి -కార్వేటినగరం :** యోగాంధ్రపై ఈనెల 21వ తేదీ నిర్వహించనున్న యోగాంధ్ర ర్యాలీ యోగాను విజయ వంతం చేయాలని ఎంపీడీవో టి చంద్రమౌళి అధికారులను కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో మండల శాఖ అధికారులతో యోగా నిర్వహణపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక్కో సచివాలయానికి ఒక అధికారిని నియమించినట్లు తెలిపారు. ట్రైనింగ్ తీసుకొని యోగా టీచర్లు 21వ తేదీ కార్యక్రమం నిర్వహించాలన్నారు. యోగా చేపట్టడంతో ఆరోగ్యకరంగా, మనిషి తేలికగా వుంటారన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు ఎం నాగరాజు, ఎంఈఓలు విజయ్ కుమార్, మనోజ్ కుమార్

అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రమౌళి

ఈవోపీఆర్‌డి నాగరత్నమ్మ, పశువైద్యాధికారి హేమకుమార్, ఏపీఎం కవిత, ఏఈ గ్రీస్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు సన్మానం

**ప్రజాశక్తి -పుంగనూరు:** ప్రభుత్వ బడుల్లో విద్యను అభ్యసించి పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రం అందించారు. స్థానిక బ్రాహ్మణ వీధిలోని బాలికల పాఠశాలలో శుక్రవారం లయన్స్ క్లబ్, హెల్పింగ్ టీం సంయుక్తంగా ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ బాలికల పాఠశాలలో పదవతరగతి విద్యార్థినులు ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో చదువును అభ్యసించి ఐదు వందలకు పైగా మార్కులు సాధించిన 30 మందికి ప్రశంసాపత్రం, స్వీట్లు అందిం చారు. ఉపాధ్యాయులు, విద్యార్థిని తల్లిదండ్రులతో కలిసి విజయోత్సవం నిర్వహించారు. బాలికల ఉన్నత పాఠశాలలో లయన్స్‌క్లబ్ సేవలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు

ప్రశంసాపత్రాలు అందుకున్న ఉత్తమ విద్యార్థులు

రుద్రాణి విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లయన్స్ క్లబ్ సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు త్రిమూర్తి రెడ్డి, అమరావతి సురేష్, రఘునాథ్ రెడ్డి, బాలసుబ్రహ్మణ్యం, ఇనాయతుల్లా షరీఫ్, కేశవ రెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది రమణ, మల్లు పల్లి గాయత్రీ పాల్గొన్నారు.

## నూతన భవనంలో మున్సిపల్ కార్యకలాపాలు: కమిషనర్

**ప్రజాశక్తి- కుప్పం టౌన్ :** కుప్పం పురపాలక సంఘం కార్యాలయ కార్యకలాపాలను సోమవారం నుండి నూతన భవనంలో నిర్వహించనున్నట్లు కమిషనర్ శ్రీనివాస రావు శుక్రవారం పత్రికా ప్రకటనలో తెలిపారు. సోమవారం నుండి పురపాలక సంఘం కార్యకలాపాలను నూతన కార్యాలయ భవనం నుండి ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి, తమ పనుల నిమిత్తం నూతన పురపాలక సంఘం కార్యాలయ భవనం వద్దకు చేరుకోవాలని సూచించారు. మేజర్ గ్రామ పంచాయతీగా కొనసాగిన కుప్పం ప్రాంతానికి గత ప్రభుత్వం పట్టణ హోదా కల్పించింది. పురపాలక సంఘానికి

సోమవారం ప్రారంభం కానున్న నూతన పురపాలక సంఘం కార్యాలయం

అనువు గా కార్యాలయ భవన నిర్మాణానికి ప్రయత్నించి పంచాయతీ భవనాన్ని కూల్చి వేసి నూతన భవన నిర్మాణా నికి శ్రీకారం చుట్టింది. ఆనాటి నుండి పట్టణంలోని బస్టాండ్ కు అతి సమీపంలోని ప్రభుత్వ భవనంలో పురపాలక సం ఘం కార్యాలయాన్ని నిర్వహించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సర కాలం పూర్తి అయిన సందర్భంగా పురపాలక సంఘం కార్యాలయానికి నూతన భవనాన్ని అందు బాటులోనికి తీసుకొచ్చారు.

## నవలా సాహిత్యం పరిపూర్ణ భాషా వికాసానికి మూలం

**ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్:** కుప్పం రెడ్డెమ్మ సాహితీ అవార్డు ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ కె రామలక్ష్మి అధ్యక్షతన స్థానిక తోట పాలెం జంక్షన్లో ఉన్న రాజా మహల్ ఫంక్షన్ హాలులో కుప్పం రెడ్డెమ్మ జాతీయస్థాయి ఉత్తమ నవలా సాహితీ పురస్కారాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామలక్ష్మి మాట్లాడుతూ కవులు, రచయితలు నవలా సాహిత్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కవులు, రచయితలు సమాజంలోని సమకాలీన పరిస్థితుల అవగాహనతో చైతన్యవంతమైన సమాజ హితం కోసం రచనలు చేయాలన్నారు. జాతీయ స్థాయి నవలల పోటీలలో నాలుగు ఉత్తమ నవలలుగా ఎంపికైన రచయితలు వారి నవలలు పద్మా దాశరధి -సాహచర్య బంధం, డిఎన్ సుబ్రహ్మణ్యం-అగ్రిమెంట్, అల్లూరి గౌరీలక్ష్మి-మలి సంజ కెంజాయ, శొంఠి జయప్రకాష్ - అదృశ్య సంకెళ్లు' కు కుప్పం రెడ్డెమ్మ సాహితీ అవార్డు ఒక్కొక్క ఉత్తమ నవలకు పదివేల రూపాయలు నగదుతో పాటు జ్ఞాపికలు , శాలువాలతో హాజరైన అతిథుల ద్వారా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కట్ట మంచి

కుప్పం రెడ్డెమ్మ సాహితీ అవార్డుల నవలా పురస్కార సభలో మాట్లాడుతున్న సాహితీ వేత్తలు

బాలకృష్ణారెడ్డి, ట్రస్టు అధ్యక్షురాలు రోజా ప్రియ,ప్రధాన కార్యదర్శి నిరంజన్ రెడ్డి, ట్రస్టు సభ్యులు ఎంఆర్ అరుణ కుమారి , సహదేవ నాయుడు హాజరయ్యారు. ప్రముఖ సమాజ సేవకులు పార్థసారధి నాయుడు, రచయితలు సీఎస్ చంద్రశేఖర్, కొఠారి వెంకటరత్నం, హరి నాయుడు, శ్యామలాదేవి, డాక్టర్ శాంత కుమారి ,కేశవ నాయుడు, ,గిరిధరన్, ఆనంద నాయుడు, రమేష్ బాబు, మునస్వామి, శాంతా భాస్కర్ మిట్టూరు నాగరాజు, రాధా, సునంద రెడ్డి, పూసల నరసింహులు పాల్గొన్నారు.